క్లుప్తంగా

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే సబితారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాటిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కమిషనర్ వెంకట్రామ్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుక్కుగూడ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛదనం-పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్, మల్లేశ్, సిబ్బంది మౌనిక, దేవేందర్ పాల్గొన్నారు.

పరిశ్రమపై చర్య తీసుకోవాలి



లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఈ-సిటీ ప్రీమియర్ సోలార్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులను గ్లిట్జ్ కాంట్రాక్టర్ వేధిస్తున్నాడని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు దత్తునాయక్ అన్నారు. గురువారం జాయింట్ లేబర్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ నిర్వాహకులు పనిచేసిన కార్మికులకు నెలసరి వేతనాలు ఇవ్వకుండా బెదిరిపులకు గురిచేస్తున్నారన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పర్వతాలు పాల్గొన్నారు.

నియామకం

యాచారం: పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా బి.తిరుమలేష్ గౌడ్ ఎన్నికయ్యారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా తిరుమలేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, అసోసియేట్ అధ్యక్షుడిగా హరిప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా జయమ్మ, కార్యదర్శిగా శ్రావణ్, మహిళా కార్యదర్శిగా సాధనలను నియమించారు. నూతన కార్యవర్గానికి సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుర్రం చెన్నకేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

బడి ఆవరణలో మందుబాబుల విందు

తలకొండపల్లి: పాఠశాల ఆవరణలో మందు బాబులు విందు చేసుకుంటున్నారు. అంతటితో ఆగకుండా ఖాళీ సీసాలు, తినుబండారాలను అక్కడే పడేసి ఆవరణను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. మండల పరిధి చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొందరు ప్రతి రోజు రాత్రి వేళలో మందు పార్టీ చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తాగిన మైకంలో ఖాళీ సీసాలను అక్కడే పడేయడంతో పాటు కొన్నింటిని పగలకొడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మందు బాబుల ఆగడాలను అరికట్టాలని కోరారు.

వినాయక.. సెలవిక



మీర్‌పేట: గణనాథుడి లడ్డూ దక్కించుకున్న గంగుల వెంకట్‌రెడ్డి



మీర్‌పేట: ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీలో వేలంలో పాల్గొన్న సభ్యులు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో గణనాథుడి లడ్డూ వేలం పాటలు కొనసాగుతున్నాయి. టీఆర్‌ఆర్ టౌన్‌షిప్ ఎస్‌ఆర్‌ఆర్ కాలనీలో శ్రీరాజరాజేశ్వరి యూత్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన వేలం పాటలో గంగుల వెంకట్‌రెడ్డి పాల్గొని రూ.2లక్షల 41వేలకు స్వామివారి ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. అదేవిధంగా ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీ గణనాథుడి లడ్డూను రూ.1లక్షా 38 వేలకు మైలవరం కేశవచారి వినోద్ రాణి దంపతులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్‌ముదిరాజ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సూరారం శ్రవణ్‌కుమార్, పొన్నాల వెంకటేశ్, ఆనంద్‌గౌడ్, పృథ్వీరాజ్, రాహుల్ పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల పరిధిలో గురువారం గణేశ్ నిమజ్జనాలు కొనసాగాయి. సరస్వతిగూడలో నిర్వహించిన వేలంలో వినాయక లడ్డూను రూ.54 వేలకు కాంగ్రెస్ నాయకుడు కంబాలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి దక్కించుకున్నాడు. అనంతరం ఊరేగింపుగా లంబోదరుడిని గంగ ఒడికి చేర్చారు. సెలవిక వినాయక అంటూ నినదించారు.నేదునూర్‌లో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.1.65లక్షలకు బీ.చంద్రయ్య దక్కించుకున్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని రామాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి లడ్డూను రామిడి కృష్ణారెడ్డి రూ.4.20 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా రామాంజనేయ భక్త సమాజం సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి లడ్డూను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, రామాంజనేయ భక్త సమాజం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగిన గణనాథుల నిమజ్జనోత్సవం

- లడ్డూ వేలంలో భక్తుల పోటాపోటీ



కందుకూరు: సరస్వతిగూడలో నిమజ్జనోత్సవంలో కమిటీ సభ్యులు



బడంగ్‌పేట్: కృష్ణారెడ్డికి లడ్డూ అందజేస్తున్న సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ దుర్గ

నిమజ్జన ఏర్పాట్లపై హర్షం

అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట మంత్రాల చెరువులో గణేశ్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించినందున గురువారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువు వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం, సిబ్బంది ఏర్పాట్లు చేయడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు బాగున్నాయని పలువురు భక్తులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జనం శాంతియుతంగా జరిగేందుకు కృషి చేసిన యంత్రాంగాన్ని ఆమె అభినందించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించాన ఈ కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

షాద్‌నగర్: సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన మట్ట యాదగిరిగౌడ్ గత కొన్నిరోజులుగా మోకాళ్ల సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఆర్థికసాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరగా వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ.1లక్షా 25వేలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ ఎంపీటీసీ వాద్యాల నర్సింహారెడ్డి, రాజు, జాంగారి జంగయ్య, అనిమి గణేశ్‌గౌడ్, జాంగారి రవి, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కందుకూరు: బాలికలు పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకొని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని సీడీపీఓ శాంతిశ్రీ, వైద్యాధికారిణి డాక్టర్ సంధ్య సూచించారు. గురువారం మండల పరిధిలోని గూడూరు గేట్ వద్ద ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో న్యూట్రీషియన్ మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం గురుకులంలో అందించే బలమైన ఆహారాన్ని వృథా చేయకుండా తప్పకుండా తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ జోలికిపోవద్దన్నారు. చిన్నతనంలోనే వివాహాలు చేసుకోవద్దన్నారు. ధైర్యంగా అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, ఐసీపీఎస్ ప్రాజెక్ట్ అధికారి భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్

- విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయుల కృషి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- ఎంఈఓ సర్దార్ నాయక్‌కు వీడ్కోలు



ఎంఈఓ సర్దార్ నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మితమై ఉంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారంటే, వారి వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో దాగి ఉందని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎంఈఓ సర్దార్ నాయక్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, సమాజంలో వారికి ఎంతో గౌరవం ఉందన్నారు. దేశ భవిష్యత్తు నిర్ణయించే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణిస్తున్నారంటే అది టీచర్ల కృషేనని పేర్కొన్నారు. మీపై బాధ్యత చాలా ఉందని, సమయానుకూలంగా పాఠశాలలకు హాజరై విద్యాబోధన చేయాలని ఎంఈఓకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎంఈఓను ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నేత రేణురెడ్డి, కృష్ణ, హెచ్‌ఎంలు రామనాథం, అంజయ్య, బాలకృష్ణ, వెంకటయ్య, శ్రీశైలం, మల్లేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ

- దైవమార్గం అనుసరణీయం
- మసీద్ కమిటీల అధ్యక్షులు



ఆమనగల్లు: ర్యాలీ తీస్తున్న ముస్లింలు

ఆమనగల్లు: మిలాద్-ఉన్-నబీ సందర్భంగా గురువారం జామై మసీదు కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మాసూం ఆధ్వర్యంలో సీఐ ప్రమోద్‌కుమార్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మసీదు ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, వివిధ మసీదు కమిటీల అధ్యక్షులు మసూం, గౌస్‌మొయినొద్దీన్, ఖాదర్‌ఖాద్రి, నాయకులు జబ్బార్, సయ్యద్ ఖలీల్, అఫ్జల్, నయీం, అక్రం, బాబా, అమీర్‌పాషా, రవూఫ్, అహ్మద్, మూసా, ఇస్మాయిల్, అసద్, ఫిరోజ్, అక్బర్, ఇమ్రాన్, సోహెబ్, సమీర్, జునైద్, ఫైసల్, అర్షాత్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మహ్మద్ ప్రవక్త చూపిన మార్గమే అనుసరణీయమని మసీద్ ఇమామ్ ఇంతియాజ్ ఖాద్రి అన్నారు. మండల పరిధి వెల్జాల్‌లో జామై మసీదు కమిటీ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్-ఉన్-నబీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా ర్యాలీ తీశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ సయ్యద్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ముజిబర్ రెహమాన్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, ఆరీఫ్, సమద్, గులాం, హుస్సేన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడి సన్మానసభకు పట్నం నేతలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: పీసీసీ నూతన అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు గురువారం నగరంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి.. ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్నం నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ సామాజికవర్గానికి చెందిన బీసీ నేతను పీసీసీ అధ్యక్షుడిగా నియమించడం సంతోషకరమైన విషయమని అభివర్ణించారు. మహేశ్‌గౌడ్‌ను నియమించిన రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దేవగౌడ్, బాలశివుడుగౌడ్, జంగయ్యగౌడ్ యదగిరి, ధన్‌రాజ్‌గౌడ్, తమ్మళ్ల కృష్ణ, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

- సమస్యను పరిష్కరిస్తాం: తహసీల్దార్లు, ఎంపీడీఓలు
- జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించండి: నాయకులు
- ముగిసిన ముసాయిదా సమావేశం



కందుకూరు: నాయకులతో మాట్లాడుతున్న అధికారులు



మహేశ్వరం: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: ముసాయిదా ఓటర్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా ఇస్తే.. సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ సైదులు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధి 30 గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను వార్డుల వారీగా రూపొందించి, జీపీ కార్యాలయాలకు పంపించామని తెలిపారు. లిస్టుపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 వరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ అనంతరం సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించలేదని, వెంటనే వాటిని గుర్తించి తీసివేయాలని అధికారులను కోరారు. తప్పులను సరిచేసి, లిస్టును పారదర్శకంగా రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి, బీఆర్‌ఎస్ నాయకులు రాములు, సీపీఐ నాయకులు యాదయ్య, సీపీఎం నాయకులు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సవరణకు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు: ఓటర్ల లిస్టులో ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలంటే దరఖాస్తు చేయాలని తహసీల్దార్ గోపాల్, ఎంపీడీఓ సరిత సూచించారు. ఓటర్ల ముసాయిదాపై ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల లిస్టును అందుబాటులో ఉంచామన్నారు. లిస్టులో వార్డుల వారీగా వివరాలు ఉన్నాయని, అందులో ఓటర్ల వివరాలు అన్ని సక్రమంగా ఉన్నాయో లేదా పరిశీలించుకోవాలన్నారు. ఏవైనా చేర్పులు అవసరమైతే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. లిస్టులో పేర్ల తొలగింపు చేపట్టాలంటే ఫారం-7 ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. తప్పులు సరిచేయడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తులు చేయాలన్నారు. కాగా గ్రామాల్లో ఓటర్ల ముసాయిదాపై ప్రచారం చేపట్టలేదని ఆయా పార్టీల నాయకులు తెలుపగా, వెంటనే దండోరా వేయించి ప్రచారం చేయిస్తామని అధికారులు వారికి తెలిపారు. నాయకులు కూడా తమ పార్టీల ద్వారా అవగాహన కల్పించి ఓటర్ల లిస్టు సక్రమంగా ఉండేలా తోడ్పాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఈ నెల 21 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఎంపీఓ గీత, వివిధ పార్టీల నాయకులు ఎ.అశోక్‌గౌడ్, ఎస్.ఎల్లారెడ్డి, బి.సంజీవరెడ్డి, అమరేందర్, శేఖర్‌గౌడ్, సాయిలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తానని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి 8వ వార్డులో రూ.6 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీటి సరఫరా లాంటి వసతులు కల్పిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపగళ్ల మహేందర్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, విష్ణుగౌడ్, రవీందర్ ముదిరాజ్, భిక్షపతిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, నరహరి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు: పట్టణంలోని కోర్టులో ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వెంకటేశ్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. చిన్నచిన్న తగాదాలు, యాక్సిడెంట్లు, భూ తగాదాలు, కొట్లాట కేసులు, చీటింగ్ తదితర కేసులను ఇరువర్గాలు మాట్లాడుకుని కోర్టులో రాజీపడవచ్చునని పేర్కొన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకుని, సమయం, డబ్బును ఆదా చేసుకోవాలని ఎస్ఐ కోరారు.

చెట్ల కొమ్మల నరికివేత

ఇబ్రహీంపట్నం: రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను గురువారం మునిసిపల్ సిబ్బంది తొలగించారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టపై రోడ్డు, కింది రోడ్డుకు ఉన్న చెట్ల కొమ్మలు.. ఏపుగా పెరిగి రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయి. ఇది వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఇదే విషయమై పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ బర్ల మంగ, కమిషనర్ రవీంద్రసాగర్‌లు కొమ్మలను తొలగింప చేశారు.

ప్రజాపాలన పేరుతో నియంత పాలన



పోలీసుల అదుపులో దశరథ్ తదితరులు



ఆమనగల్లు: పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ శ్రేణులు

- ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం
- జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్

కడ్తాల్: ప్రజా సమస్యలపై పోరాడే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతును నొక్కుతుందని విమర్శించారు. రుణమాఫీ కాని రైతులు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు పత్యానాయక్, రమేశ్‌నాయక్, చందులను పోలీసులు ముందస్తు అరెస్టుచేసి, ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా జర్పుల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తుందని ఆరోపించారు. అసమర్థ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో సర్కారుకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

ఆమనగల్లు: రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిపొందని రైతులు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలువురు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీలు కుమార్, పంతునాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు నిరంజన్‌గౌడ్, బాలస్వామి, సయ్యద్ ఖలీల్, రమేశ్, శివకుమార్, వడ్డె వెంకటేశ్, జంగయ్య, రమేశ్, యాదయ్య, ఆనంద్, దేవేందర్, గణేశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

పీఏసీఎస్ ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: మండలంలోని ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో ప్రిన్సిపాల్ టీనావతి, 17 మంది ఉపాధ్యాయుల బృందం పాత్ర ఎంతో కీలకమని పీఏసీఎస చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నుంచి బదిలీ అయిన ప్రిన్సిపాల్‌తో సహా 17 మంది ఉపాధ్యాయులకు గురువారం పాఠశాల వద్ద వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆగిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్‌లు మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా ప్రిన్సిపాల్ టీనావతి తన ఉపాధ్యాయ బృందంతో ఎంతో కష్టపడి పనిచేసి ఆదర్శ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఒకేసారి ఉపాధ్యాయులందరూ బదిలీ కావటం బాధాకరమన్నారు. ప్రిన్సిపాల్ టీనావతి మాట్లాడుతూ.. తన ఉద్యోగ జీవితంలో చేవెళ్లను ఎప్పటికీ మరిచిపోలేనని చెప్పారు. ఇక్కడ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, నాయకులతో ఉన్న అనుబంధం మరిచిపోలేనిదన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందానికి సన్మానం చేసి కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీ ఆంజనేయులు, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.